ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

సోమవారం 18 నవంబరు 2024



ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలోని
శ్రీదత్త ఇంజినీరింగ్ కాలేజీలోని సెంటర్‌కు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు

సజావుగా గ్రూప్-3 పరీక్షలు

- 20,714 మంది అభ్యర్థుల హాజరు
- 19,935 మంది గైర్హాజరు

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం/ మొయినాబాద్ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షలు జిల్లాలో సజావుగా జరిగాయి. మొయినాబాద్, ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో సుమారు 58 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 40,649 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 20,714 మంది పరీక్షలు రాశారు. 19,935 మంది గైర్హాజరయ్యారు. ఇబ్రహీంపట్నం పరిధిలో 20 పరీక్ష కేంద్రాల్లో 13,388 మంది అభ్యర్థులకు గాను 6,735 మంది హాజరయ్యారు. 6,653 మంది గైర్హాజరయ్యారు. అలాగే మొయినాబాద్ మండలంలో ఏర్పాటు చేసిన 10 కేంద్రాల్లో 6,726 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1,733 మంది పరీక్షలు రాశారు. 4,993 మంది హాజరు కాలేకపోయారు. హయత్‌నగర్‌లో పరిధిలో 14 సెంటర్లలో 3,375 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా 2,457 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 918 మంది

మిగతా 8వ పేజీలో...



హైతాబాద్‌లో బోనాల ఊరేగింపు

కనుల పండువగా మల్లన్న బోనాలు

షాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో మహంకాళి, బీరప్ప, మల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వారం రోజులుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం మల్లన్న స్వామి బోనాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

యూనియన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

- టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి

శంకర్‌పల్లి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘానికి వ్యతిరేకంగా కార్యక్రమాలకు చేపడితే వారిని సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి తెలిపారు. శంకర్‌పల్లిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయుడు జెకైలాసం, మేడ్చల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్. వెంకటేశ్వర్లు, యాదాద్రి జిల్లా అధ్యక్షుడు లచ్చుమల్ల వెంకన్న, కార్యవర్గ సభ్యుడు బి.నాగేశ్వర్‌రావు, ప్రాథమిక సభ్యుడు సీహెచ్. వెంకటేశ్వర్‌రావును సంఘం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వీరి సస్పెన్షన్ తక్షణమే అమలులోకి వస్తుందన్నారు. ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన వ్యక్తి కార్యవర్గ సమావేశం నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్ష కార్యదర్శులు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీయూటీఎఫ్ సంఘానికి ఎంతో పేరుందని ఆయన గుర్తు చేశారు. సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడుతన్న వారిని సహించేది లేదన్నారు.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విదేశాల్లో ఉచిత విద్యను అభ్యసించాలనుకునే మైనార్టీల నుంచి ఫ్రీ కోచింగ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ విద్యార్థులకు ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ, టోఫెల్ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. ముస్లిం, జైన్, పార్సీ అభ్యర్థులు ఈనెల 18 నుంచి 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఆధార్‌కార్డు పత్రాలు జిరాక్స్, పాస్‌ఫోటో జత చేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 040-23236112లో సంప్రదించాలని ఆయన కోరారు.

రెండో ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్



మాట్లాడుతున్న యూసుఫ్

శంషాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలను పర్మినెంట్ చేసేవరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. యూసుఫ్ పిలుపునిచ్చారు. శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో ఆదివారం రెండో ఏఎన్ఎంల రాష్ట్ర ప్రథమ మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో రెండో ఏఎన్ఎంల సంఖ్య దాదాపు 7000 ఉంటుందని, వారు 18 ఏళ్లుగా పనిచేస్తున్నా ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయకపోవడం దారుణమన్నారు. వీరి శ్రమ కారణంగానే ప్రభుత్వానికి అనేక అవార్డులు వస్తున్నాయన్నారు. కానీ రెండో ఏఎన్ఎంలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఏఐటీయూసి ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహ్మా మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తుందన్నారు. మహిళలు అని కూడా చూడకుండా ఏఎన్ఎంలపై మొండివైఖరి అవలంబిస్తుందని ఆరోపించారు. వీరిని పర్మినెంట్ చేయాలని, అలా కుదరకపోతే 5వేల పోస్టులను మంజూరు చేసి నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, జిల్లా అధ్యక్షుడు రామస్వామి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోమిరెడ్డిశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు సక్రూ, రాష్ట్ర నాయకురాలు రమావత్‌రాణి, ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర నాయకులు శ్యామల, జయ, పద్మ, సువర్ణ, అరుణ, జయమమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజా విజయోత్సవాలు

- జిల్లాలో పర్యటించనున్న కళాయాత్ర బృందం
- ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన

రంగారెడ్డి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజా విజయోత్సవాలకు రంగం సిద్ధం చేసింది. రాష్ట్రమంతా పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే ఈనెల 19 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు జిల్లాలో ప్రజాపాలన కళాయాత్ర చేపట్టేలా కలెక్టర్ సి. నారాయణరెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కళాయాత్ర బృందం ప్రొఫెసర్ అలేఖ్య పుంజల, అంతడుపుల నాగరాజు రాష్ట్రమంతా పర్యటించనున్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న సాంస్కృతిక సారథి కళాకారులచే జిల్లాలోని మండలాలు, గ్రామ పంచాయతీల్లో రెండు టీమ్‌లుగా ఈనెల 19వ తేదీ నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటిస్తూ ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పిస్తూ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 19వ తేది నుంచి ప్రారంభమయ్యే విజయోత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు.



ఉపాధ్యాయుడు రాములుకు రాష్ట్రస్థాయి అవార్డు

చౌదరిగూడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలపరిధిలోని రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాల టీచర్ రాములు 22 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్రస్థాయి టీచర్ స్ఫూర్తి ఇన్స్పిరేషన్ అవార్డు దక్కింది. శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ భాస్కర ఆడిటోరియంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్, కమలమనోహర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



నకిలీ నారుకు కళ్లెం..!

నకిలీ నారుకు కళ్లెం వేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం నర్సరీలను చట్టం పరిధిలోకి తీసుకువస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటినుంచి నర్సరీ నిర్వహణకు లైసెన్సు తప్పనిసరి చేసింది. గతంలో ఉన్న చట్టాన్ని సవరిస్తూ కొత్తగా తీసుకు వచ్చిన దానిని పకడ్బందీగా అమలు చేసేందుకు ఉద్యాన శాఖకు బాధ్యతలు అప్పగించింది. లైసెన్సు లేకుండా నర్సరీని నిర్వహిస్తే చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.



జిల్లాలో అనుమతి లేని నర్సరీలపై చర్యలు

150కి పైగా నర్సరీలు, అనుమతి ఉన్నవి 26

రెన్యువల్ లేకుండానే కొనసాగుతున్న కొన్ని నర్సరీలు

నాణ్యత లేని నారు కొనుగోలు చేసి నష్టపోతున్న రైతులు

నర్సరీలకు లైసెన్సులు తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

రిజిస్ట్రేషన్ లేని వాటికి నోటీసులు జారీ చేస్తున్న ఉద్యానశాఖ అధికారులు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :నర్సరీలన్నీ ఉద్యానవన శాఖ పరిధిలోకి వచ్చేశాయి. జిల్లాలో 150కి పైగా నర్సరీలు ఉండగా, అందులో 26 నర్సరీలు మాత్రమే ప్రభుత్వం నుంచి అనుమతి పొంది ఉన్నాయి. మిగతావి అక్రమంగా కొనసాగుతున్నాయి. అనుమతి పొందిన వాటిల్లో కూడా కొన్ని నర్సరీలు లైసెన్సు రిన్యూవల్ చేసుకోలేదు. దీంతో అనుమతి లేకుండా కొనసాగుతున్న నర్సరీలపై ఇకనుంచి ఉద్యానవన శాఖ అధికారులు ఉక్కుపాదం మోపేందుకు రెడీ అవుతున్నారు. అలాగే ఎదుగుదల లేని మొక్కలు విక్రయించినా, కల్తీ నారు అంటగట్టినా కటకటాలు లెక్కించాల్సిందే. జిల్లాలో నకిలీ విత్తన మాఫియాను అణచివేసే క్రమంలో నర్సరీలకు రిజిస్ట్రేషన్(లైసెన్స్) తప్పనిసరి చేసింది రాష్ట్ర ప్రభుత్వం. స్థానికంగా రైతులు ఎక్కువగా పూలు, పండ్లు, కూరగాయలు సాగు చేస్తుంటారు. అలాగే మిరప, టమాట, వంకాయ, చిక్కుడు, పచ్చిమిర్చి, క్యాలీఫ్లవర్, పాలకూర, తోటకూర, మెంతంకూర తదితర పంటలు ఎక్కువగా పండిస్తారు. పంటల సాగును దృష్టిలో ఉంచుకుని నర్సరీల నిర్వాహకులు నారును పెంచుతున్నారు. అయితే జిల్లాలో ఎక్కువగా

మిగతా 8వ పేజీలో...

రిజిస్ట్రేషన్ కోసం...

ఇబ్రహీంపట్నం, యాచారం, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, మాడ్గుల, మంచాల మండలాలకు చెందిన రైతులు ఉద్యానవన శాఖ అధికారి నవీన (8977714219)ను సంప్రదించాలి. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, శేరిలింగంపల్లి, గండిపేట మండలాలకు చెందిన రైతులు ఉద్యానశాఖ అధికారి కీర్తి కృష్ణ (8977714222)ను సంప్రదించాలి. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్, రాజేంద్రనగర్ రైతులు ఉద్యానశాఖ అధికారి సౌమ్య (8977714221) ను సంప్రదించాలి. అలాగే షాద్‌నగర్, కేశంపేట్, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడెం,కొందుర్గు మండలాలకు చెందిన రైతులు ఉద్యానశాఖ అధికారి హిమబిందు (8977714220)ను సంప్రదించాలి.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

టర్నింగుల వద్ద తరచూ ప్రమాదాలు

యాక్సిడెంట్లలో పలువురు మృత్యువాత

రోడ్డు విస్తరణ చేపట్టాలని డిమాండ్

పట్టించుకోని అధికారులు, పాలకులు



8

వామ్మో.. వానరాలు!

ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు

ప్రజలపైకి ఎగబడుతూ దాడులు

కాళ్లు, చేతులు విరిగి ఆస్పత్రి పాలు

కందుకూరు మండల ప్రజల బెంబేలు



7

'మహా అన్నకూట్ మహోత్సవం

శంషాబాద్-గగన్‌పహాడ్‌లోని సత్యం శివం

సుందరం గోశాలలో యజ్ఞం

వేలాదిగా తరలివచ్చిన జంతు ప్రేమికులు

ఆవులకు గడ్డి, దాణా అందజేత



7

వైభవంగా మైసమ్మ రథోత్సవం



మైసిగండి మైసమ్మ ఆలయం వద్ద పెద్ద రథోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పెద్ద తేరు నేపథ్యంలో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. రథాన్ని పచ్చటి తోరణాలతో పాటు పుష్పాలతో శోభాయామానంగా అలంకరించారు. రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పెట్టి భక్తులు తాళ్లతో రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. కడ్తాల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి)

పరుగో పరుగు

- కన్హా శాంతివనంలో అట్టహాసంగా గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్
- 2కే, 5కే, 10కే, 21కే రన్ పోటీలు
- హాజరైన సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, క్రీడాకారులు



రన్‌ను ప్రారంభిస్తున్న సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

నందిగామ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలపరిధిలోని కన్హాశాంతివనంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్, స్పోర్ట్స్ అండ్ ఫిట్ ఇండియా సహకారంతో హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ గ్రాన్యూల్స్ ఇండియా ఆధ్వర్యంలో గ్రీన్ కన్హాలో భాగంగా 2కే, 5కే, 10కే, 21కే రన్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశంలోని సుమారు 60 నగరాల నుంచి 4200 మంది పాల్గొన్నారు. పోటీలను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, రామచంద్రమిషన్ ప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు. గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ ద్వారా వచ్చే డబ్బును చెట్ల పెంపకానికి ఉపయోగించడం అభినందనీయమని సీపీ అన్నారు. యువకుల్లో ప్రతిభను వెలికితీసేందుకు పరుగు పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని పారిస్ పారా ఒలింపిక్స్ కాంస్య విజేత దీప్తి జీవన్‌జీ అన్నారు. గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్ నెస్ రన్ ద్వారా వచ్చే ఆదాయంతో అడవుల్లో 10 వేల చెట్లను పెంచడమే లక్ష్యంగా నిర్ధేశించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి భారత మాజీ క్రికెటర్లు రవిశాస్త్రి, ఆర్.శ్రీధర్ మద్దతు తెలిపారు. గెలుపొందిన వారికి పద్మభూషణ్ గ్రహీత కమలేష్‌పటేల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రాన్యూల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి, ఇండియన్ జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేష్, ఐపీఎస్ అధికారి బలరాం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శారీరక దృఢత్వం అవసరం

మేడ్చల్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శారీరక దృఢత్వం అవసరమని జాతీయస్థాయి పూర్వ సైక్లిన్ అథ్లెటిక్ మర్రి లక్ష్మారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సన్‌ఫ్లవర్ వేదిక్ పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బందితో కలిసి వాక్ థాన్ 5కే, సైక్లాథాన్ 10కే, శారీ థాన్ 5కే, రన్ 5కే నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి లక్ష్మారెడ్డి పాల్గొని విద్యార్థులతో కలిసి సైక్లింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సరిత కుమారి, ప్రిన్సిపాల్ కల్పన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



5కే రన్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

కొడంగల్‌లో ఘనంగా సదర్ ఉత్సవాలు

కొడంగల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సదర్ ఉత్సవాలను కొడంగల్‌లో ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు వివిధ గ్రామాల నుంచి దున్నపోతులను తీసుకొచ్చి విన్యాసాలు చేయించారు. కొడంగల్ పట్టణంలోని గాడిబావి శివాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కొనసాగిన దున్నపోతుల విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ సదర్ ఉత్సవాలు యాదవ కులస్తుల సంస్కృతి సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. సదర్ ఉత్సవాలను చూసేందుకు కొడంగల్ పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నియోజకవర్గ నాయకులు మధుసూదన్‌యాదవ్, డాక్టర్ రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సదర్ ఉత్సవాల్లో యాదవ సంఘం నాయకులు

గోశాలలో 'మహా అన్నకూట్' మహోత్సవం


యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

శంషాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ - గగన్‌పహాడ్ లోని సత్యం శివం సుందరం గోశాలలో ఆదివారం మహా అన్నకూట్ మహోత్సవం ఘనంగా జరిగింది. 84 సంవత్సరాల వయస్సున్న ధరమ్‌రాజ్ రాంఖా ఇక్కడ ఆవులకు సేవ చేస్తున్నారు. 8 ఎకరాల స్థలంలో సత్యం శివం సుందరం గోశాలను స్థాపించారు. అన్ని కబేళాల నుంచి రక్షింపబడిన ఆవులు, ఎద్దులకు ఇక్కడ ఆశ్రయం కల్పిస్తున్నారు. ప్రస్తుతం 6,000లకుపైగా ఆవులకు ఆశ్రయం కల్పిస్తున్నాడు. ఇక్కడ ఉన్న ఆవులకు గడ్డి, దాణా వేసి పెంచుతారు. ఆవు పేడను రైతులకు జీవ ఎరువుగా చాలా సరసమైన ధరకు అందజేస్తారు. ఆవుల సంరక్షణకు 100 మంది కూలీలను నియమించారు. మొత్తం నెలకు రూ.70 లక్షల నిర్వహణ ఖర్చు వస్తుందని ధరమ్‌రాజ్ రాంఖా తెలిపారు. అన్నకూట్ పండుగను కొత్త ఆహారంగా గోశాలలో జరుపుకుంటామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో పండిత్ హరిశ్చంద్రజీ కులకర్ణి, మహాలక్ష్మీ పంచకుండా మహాయజ్ఞం పూజ ఆశ్రయంలో నిర్వహించారు. హైదరాబాద్-సికింద్రాబాద్ జంటనగరాలకు చెందిన వేలాదిమంది జంతుప్రేమికులు ఈ ఉత్సవంలో పాల్గొని ఆవులకు గడ్డి, దాణా అందించి యజ్ఞ పూజలో పాల్గొన్నారు.

గండిమైసమ్మకు దండిగా మొక్కులు

కడ్తాల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) మైసిగండి మైసమ్మ బ్రహ్మోత్సవాలు కనుల పండవగా కొనసాగుతున్నాయి. రంగురంగుల విద్యుత్ దీపాలు పచ్చటి తోరణాలు రంగురంగుల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచేకాక పొరుగు జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన మైసమ్మ ఆలయానికి హిందువులతో పాటు ముస్లింలు కూడా హాజరవుతున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండ ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీ పంతు, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు పోట్టెత్తారు. అమ్మవారిని పట్టు వస్త్రాలు బంగారు ఆభరణాలతో అలంకరించి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు మైసమ్మ నామస్మరణతో మైసిగండి మారు మోగింది. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఉత్సవ నిర్వాహకుడు రమావత్ భాస్కర్, తహసీల్దారు ఆర్‌పీ జ్యోతి, మాజీ సర్పంచులు శేఖర్‌గౌడ్, తులసీరామ్‌నాయక్, అర్చకులు గ్రామ యువకులు తదితరులున్నారు.


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


గోడ పత్రికను విడుదల చేస్తున్న బేర బాలకిషన్, తదితరులు

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

కందుకూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ ఒకటో తేదీన నగరంలో నిర్వహించనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బేర బాలకిషన్ కోరారు. ఆదివారం మాలల సంఘం మండల కన్వీనర్ గాదె కుమార్ అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి లక్షలాది మంది మాలల అహోరాత్రులు కష్టపడ్డా విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎస్సీలకు కావలసింది వర్గీకరణ కాదని దళితులు సమగ్ర అభివృద్ధి జరుగాలన్నారు. అందు కోసం 15శాతం ఉన్న ఎస్సీల రిజర్వేషన్‌ను 25శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జనకు మాలలు 10లక్షలకు పైగా హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మహేశ్వరం నియోకవర్గం ఉద్యోగ నాయకులు యాలాల శ్రీశైలం, గాదె లక్ష్మయ్య, యాదయ్య, నరసింహ, యాలా ల శ్రీనివాస్, పాండు, శ్రీనివాస్, బాల్‌రాజ్, విష్ణు, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కమిటీ ఎన్నిక


మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. రాజగంగారెడ్డి, కోశాధికారి తుకారంల సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎన్.రామ్‌రెడ్డి(భౌరంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), ప్రధాన కార్యదర్శిగా టీ.మురళీ కృష్ణ మూర్తి(కౌకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), కోశాధికారిగా భాగ్యమణి(కొల్తూరు)ను ఎన్నుకున్నారు. అదేవిధంగా రాష్ట్ర కౌన్సిలర్లుగా డి.వేణు(శామీర్‌పేట), ఎం.వి.వి.రామకృష్ణ(బాచుపల్లి)ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సత్యం, కృష్ణ, గిరిధర్, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వామ్మో.. వానరాలు!

» ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు » ప్రజలపైకి ఎగబడుతూ దాడులు
» కాళ్లు, చేతులు విరిగి ఆస్పత్రి పాలు » బెంబేలెత్తిపోతున్న కందుకూరు మండల ప్రజలు

కందుకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువైంది. మనుషులు కనబడితే చాలు మీద దునుకుతూ దాడి చేస్తున్నాయి. మనుషులు లేని సమయాల్లో ఇళ్లల్లోకి చొరబడి వస్తువులను తీసుకెళ్లి రోడ్లపై పడేస్తున్నాయి. ఇళ్లలోకి వచ్చిన వానరాలను వెళ్లగొట్టేందుకు ప్రయత్నించిన ఐదు మంది కిందపడి కాళ్లు, చేతులు విరిగి ఆస్పత్రి పాలయ్యారు. మండల కేంద్రంతోపాటు కొత్తగూడ తదితర గ్రామాల్లో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి.

నగరానికి అతి సమీపంలో ఉన్న కందుకూరు మండంలో రైతులు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం సాగించే వారు. ఏడారేళ్లుగా ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందడంతో వ్యవసాయ భూములు ప్లాట్లుగా, ఫాంహౌస్‌లుగా మార్చారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని చెట్లను నరికేశారు. దీంతో వ్యవసాయ క్షేత్రాల్లో ఉండే వానర సైన్యం ఊళ్ల మీద పడుతోంది. అలాగే మండల కేంద్రంలోని పలు ఫంక్షన్ హాల్‌లలో సైతం కోతులు తిష్టం వేసి అక్కడి వస్తువులను చిందరవందరగా చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మండల కేంద్రంలో వానరసైన్యం ఇళ్లల్లోకి వచ్చి దాడులు చేయడంతో ఇటీవల సౌడపు సుజాత, బొక్క రాంచంద్రారెడ్డి, యాలాల శ్రీనివాస్‌రెడ్డి, ఇలా కందుకూరులో వానర సైన్యం ప్రజ




కందుకూరు వీధుల్లో తిరుగుతున్న కోతులు

కోతుల బెడద ఎక్కువైంది



రోజురోజుకు కోతుల బెడద ఎక్కువైంది. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. పిల్లలను దుకాణాలకు పంపిచాలంటే కూడా భయం వేస్తోంది. ఇంటి ఆవరణలో ఏదైనా ధాన్యం ఆరబోసుకోవాలంటే కూడా ఇబ్బందిగా మారింది. నేను ఇటీవల ఇంటిపై నుంచి కిందకు వస్తుండగా కోతులు ఒక్కసారిగి నాపై దాడి చేశాయి. ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి వెనుకకు పరుగెత్తడానికి ప్రయత్నించి కిందపడటంతో రెండు కాళ్లు విరిగాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడదను అరికట్టాలి.

-సౌడపు సుజాత, కొత్తగూడ

వీధుల్లో తిరగలేక పోతున్నాం



కందుకూరులో వీధుల్లో తిరగలేక పోతున్నాం. ఎప్పుడు కోతుల గుంపు దాడిచేస్తుందోనని భయంతో బతుకుతున్నాం. మూడేళ్లుగా కోతుల గుంపులు ఇబ్బంది పెడుతున్నాయి. ఇంత జరగుతున్నా.. సంబంధిత అధికారులు మాత్రం వాటిని అడవుల్లోకి తరలించడానికి ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. ఇళ్లలో ఉన్న మహిళలు మధ్యాహ్నం వేళల్లోనూ డోర్లు మూసుకోని ఉండాల్సి వస్తోంది. నేను ఉదయం వేళలో దేవాలయానికి వెళ్లగా అక్కడ కోతుల గుంపు నాపై దాడి చేసింది. ఆ ప్రమాదంలో నా ఎడమ కాలు విరిగింది. నాలాగే చాలా మందికి గాయాలై అవస్థలు పడుతున్నారు.

-యాలాల శ్రీనివాస్‌రెడ్డి, కందుకూరు

బీసీల స్థితిగతులపై 21న బహిరంగ విచారణ



రంగారెడ్డి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీల స్థితిగతులపై 21న కొంగర కలాన్‌లోని కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ ఉంటుందని కలెక్టర్ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు రంగారెడ్డి జిల్లా, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4 గంటల వరకు వికారాబాద్ జిల్లాకు సంబంధించి విచారణ ఉంటుందన్నారు. జిల్లాలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకోవాలని, బీసీలు పడుతున్న ఇబ్బందులు తొలగిపోవడానికి, బీసీల పరిస్థితి మెరుగుపర్చడానికి రాష్ట్ర సంక్షేమానికి నిధులు కేటాయించేందుకు ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని కమిషన్ భావిస్తుందన్నారు. 21న కలెక్టరేట్‌లో నిర్వహించే బహిరంగ విచారణలో బీసీ సంఘాలు, సంచార జాతులు, ఇతర కులాల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంచార జాతుల కుల పెద్దలతో పాటు ఇతర కులపెద్దలు, కమిషన్ ఇచ్చే నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటు ఆరు సెట్లతో తెలుగు/ఇంగ్లీషు భాషలో బహిరంగ విచారణకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

ధారూరు మండలాన్ని అభివృద్ధిపరుస్తాం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరా రెడ్డి


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రఘువీరారెడ్డి

ధారూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే నాలుగేళ్లలో ధారూరు మండల అభివృద్ధికి కృషి చేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి తెలిపారు. మండలంలోని ఎబ్బనూర్‌లో రూ.20లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. కెరెల్లి గ్రామంలో 15 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అశోక్ ముదిరాజ్, రాజేందర్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కుట్రలో భాగమే లగచర్ల ఘటన

» కేటీఆర్‌ను వెంటనే అరెస్టు చేయాలి » డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్


విలేకరులతో మాట్లాడుతున్న హన్మానాయక్, బిక్యానాయక్

కడ్తాల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటన బీఆర్‌ఎస్ కుట్రలో భాగమేనని డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బిక్యానాయక్, రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షులు హన్మానాయక్ అన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని అస్థిర పరచి రాజకీయంగా లబ్ధిపొందేందుకు మాజీ మంత్రి కేటీఆర్ డైరెక్షన్‌లోనే అధికారులపై దాడులు జరిగాయని ఆరోపించారు. కడ్తాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రైతులను రెచ్చగొట్టి అధికారులపై దాడి చేయించిన కేటీఆర్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొడంగల్ అభివృద్ధి జరుగుతుంటే జీర్ణించుకోలేని కేటీఆర్ విషం కక్కుతున్నారని వారు మండిపడ్డారు. కొడంగల్‌ను 2018లో కేటీఆర్ దత్తత తీసుకొని కృష్ణాజలాలతో కాళ్లు కడుగుతా అని జనాన్ని సమ్మించి అధికారంలోకి వచ్చాక పట్టించుకోకుండా మోసం చేశారని మండిపడ్డారు. లగచర్ల గిరిజన రైతులందరూ అమాయకులని వాళ్లను రెచ్చగొట్టి అధికారులపై దాడులకు పాల్పడేలా చేసిన కేటీఆర్, బీఆర్‌ఎస్ నాయకులను కఠినంగా శిక్షించాలని కోరారు. సమస్యలపై ప్రజల తరపున పోరాడాల్సిన ప్రతిపక్షం అమాయక ప్రజలను అడ్డుపెట్టుకొని అలజడులు సృష్టించడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి చర్యలను ఆపకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సేవాదల్ మండల అధ్యక్షులు లక్ష్మయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, నరేందర్, రమేశ్ నాయక్, నరేశ్ నాయక్, దేవ్లా, సేవ్యానాయక్, బలరాం, లక్పతినాయక్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ నేతల ద్వంద్వనీతి సరికాదు

యాచారం: లగచర్ల ఘటనను బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయం చేయడం దారుణమని యాచారం మండల కాంగ్రెస్ నాయకులు దెంది రాంరెడ్డి, మస్కు నర్సింహులు మండిపడ్డారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ఎందుకు పేదల భూములు తీసుకున్నారని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ భూములు తీసుకోవడంతో అనేక మంది పేదలు నేడు ఉపాధి లేక అల్లాడుతున్నారని వారు ఆందోళన చెందారు.


నియామక పత్రాన్ని అందజేస్తున్న కేఎల్లార్

మహేశ్వరం ఏఎంసీ చైర్మన్‌గా కృష్ణానాయక్

కందుకూరు/మహేశ్వరం నవంబరు 17:(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ కందుకూరు మండలాన్ని వరించింది. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదివారం పెద్దమ్మ తాండకు చెందిన ఎస్ కృష్ణానాయక్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమిస్తున్నట్లు నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన 2001లో పులిమామిడి ఎంపీటీసీగా బాధ్యతలు చేపట్టారు. 2006 నుండి 2011 వరకు కృష్ణానాయక్ భార్య ఎస్ గోభీకృష్ణానాయక్ ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2015లో జిల్లా పార్టీలో బాధ్యతలు చేపట్టిన ఆయన 2016 నుండి 2022 వరకు మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా కృష్ణానాయక్ మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు ఇచ్చిన ప్రతి నాయకుడికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా డైరక్టర్లను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, శ్రీధర్, సత్యనారాయణ, మల్లేష్, భూపాల్‌రెడ్డి, మహేందర్, రఘుపతి, కప్పాటి పాండురంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వే గడువు పొడిగిస్తారా?

జంబో ప్రశ్నలతో ముందుకు సాగని సమగ్ర సర్వే

షెడ్యూల్ ప్రకారం నేడే చివరి తేదీ

50 శాతం దాటకపోవడంతో పొడిగించే ఛాన్స్!


సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్

తాండూరు, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే -2024 గడువు పొడిగించే అవకాశాలు ఉన్నాయి. షెడ్యూల్ ప్రకారం 18వ తేదీ (నేటి)తో క్షేత్ర స్థాయిలో సర్వే ముగియాల్సి ఉంది. 8 పేజీలు 75 రకాల ప్రశ్నాలతో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి అక్కడ వివరాలు సేకరించేందుకు 40 నిమిషాల నుంచి గంట సమయం పడుతోంది. రోజుకు ఎంత కష్టపడినా 10 నుంచి 12 ఫామ్స్ వరకు మాత్రమే నింపగలుగుతున్నారు. దీంతో ఈ నెల 9న ప్రారంభమైన నాటికి పూర్తి స్థాయిలో ఫారాలు రాకపోవడం, క్షేత్ర స్థాయిలో సర్వే ఎందుకు అనే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించే వరకు మూడు రోజుల సమయం పట్టింది. ప్రస్తుతం ఆదివారం సాయంత్రం నాటికి తాండూరు డివిజన్‌లో 48శాతం మాత్రమే సర్వే పూర్తయింది. ఇంకా 52 శాతం వరకు సర్వే చేయాల్సి ఉంది. తాండూరు డివిజన్ పరిధిలో 9 మండలాలు, రెండు మున్సిపాలిటీలు కలిపి 1,22,862 ఇళ్లు ఉండగా 58,150 ఇళ్లలో మాత్రమే సర్వే పూర్తయింది. ఇంకా 64,712 ఇళ్ల సర్వే పూర్తి కావాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

కష్టాల్లో కార్యదర్శులు!

» నిధులు లేక పెరుగుతున్న ఒత్తిడి
» అప్పులు చేసి పంచాయతీ పనులు
» అన్ని శాఖల పనులతో పెరిగిన పనిభారం
» ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆగమాగం
» ఆదుకోవాలంటూ వేడుకోలు


పెద్దేముల్ ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్యదర్శులు(ఫైల్)

తాండూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఫిబ్రరి 2న సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. తొమ్మిది నెలలు గడిచినా ఎన్నికలు జరుగలేదు. దీంతో పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. అప్పటి నుంచి పంచాయతీలకు రావాల్సిన గ్రాంట్లు నిలిచిపోగా, ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా ముందుగా గుర్తుకొచ్చేది పంచాయతీ కార్యదర్శులే. అటు నిధులు లేక ఇటు బాధ్యతలు పెరిగి కార్యదర్శుల కష్టాలకు మొదలయ్యాయి. మరోవైపు గ్రామాలకు నియమించిన ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో ఊర్లో ఉన్న జనంతో పాటు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో విధులు నిర్వహించేందుకు సతమతమవుతున్నారు. పంచాయతీలలో తీవ్ర నిధుల కొరత ఏర్పడడంతో రోజువారీ కార్యకలాపాలకు గాను పంచాయతీ కార్యదర్శులు వారి జీతం నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి. జనవరి నుంచి ఇప్పటి వరకు చేయించిన పనుల చెక్కులు క్లియర్‌కాక పోవడంతో ప్రస్తుతం పంచాయతీలకు అవసరమైన సామగ్రి ఇచ్చేందుకు ఎజెన్సీలు, దుకాణాదారులు ఉద్దెర ఇవ్వడానికి ముందుకు రాని దుస్థితి. అలాగే పంచాయతీ సిబ్బందికి నెలల తరబడి జీతాలు రాకపోడంతో ఎంతో కొంత తన జీతం నుంచి ఇచ్చి వారి సేవలను వినియోగించుకుంటున్నారు. అది కూడా వారిని బతిమిలాడుకోవాల్సి వస్తోంది. లేకపోతే పారిశుధ్య, మంచి నీటి సరఫరా, విద్యుత్ దీపాల పనులు నిలిచి పోతాయనే భయం నెలకొంది. దీనికి తోడు ట్రాక్టర్ డీజిల్ కూడా సొంత డబ్బులతో పోయిస్తున్నారు.

ఆందోళన బాటలో సెక్రటరీలు

కార్యదర్శులు వచ్చే జీతంతో పాటు అప్పులు చేసి మరీ పల్లెల్లో పనులు నిర్వహించాల్సిన పరిస్థితి. స్టేట్ ఫైనాన్స్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు నిలుపుదల చేయడంతో పారిశుధ్య, మురుగు కాల్వ పూడికతీత, నీటి సరఫరా మోటార్లు రిపేర్ ట్రాక్టర్ రిపేర్లు, వీధి దీపాల నిర్వహణ, గ్రామ సభల నిర్వహణ, ఇలా రకరకాల పనులు చేయిస్తున్నా ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాండూరు డివిజన్‌లోని ఏడు మండలాలలోని కార్యదర్శులు ఎంపీడీఓలకు వినతిపత్రాలను సమర్పించారు.

పని భారం తగ్గించండి

కేవలం పంచాయతీరాజ్ శాఖ పనులే అప్పగించి పనిభారం తగ్గించాలని కోరుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి నియమించినప్పటికీ అన్ని శాఖల పనులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగు దొడ్లు, సర్వే, వ్యవసాయక శాఖకు సంబంధించిన సర్వేలు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, వివాహాల రిజిస్ట్రేషన్లు తదితర పనులను పంచాయతీ కార్యదర్శే పర్యవేక్షించాల్సి ఉంటుంది. పంచాయతీ కార్యదర్శిపై ఎంపీఓలు, ఎంపీడీవోలు, డీఎల్‌పివో, డీపీవోలు పనులు చేయాలని వత్తిడి పెంచుతున్నారే తప్ప వారి సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పని చెబితే ఎలా చేయాలని ఆలోచించేలోపే నిర్లక్ష్యం చేస్తున్నారంటూ మెమో, చార్జీ మెమోలు, సస్పెన్షన్లు ఎదుర్కోవాల్సి వస్తుందనిపంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మూసీనది సమీపంలో షూటింగ్ చేస్తున్న బృందం

కొత్తగూడెంలో పుష్ప-2 షూటింగ్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్, కొత్తగూడెం మూసీనది సమీపంలో ఆదివారం పుష్ప-2 చిత్రానికి సంబంధించి పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. మూసీనది వంతెన వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేసే సన్నివేశంతో పాటు ఇతర సన్నివేశాలను చిత్రీకరించారు. చిన్న చిన్న ఆర్టిస్టులతోనే ఈ షూట్ పూర్తిచేశారు. కాగా, అల్లు అర్జున్ వస్తారనే ప్రచారంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, యువకులు అధిక సంఖ్యలో షూటింగ్ చూడడానికి తరలివచ్చారు.


మాట్లాడుతున్న శ్రీరాములు యాదవ్

రైతులకు సమాచారమివ్వకుండా భూసేకరణ చేయడమేంటి?

- బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్

కందుకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా వారి పట్టా భూములను ఫ్యూచర్‌ సిటీ కొరకు రోడ్డు వేసేందుకు అధికారులు భూసేకరణ సర్వే చేయడం ఏమిటని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌ ఆరోపించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో అధికారులు రైతుల పట్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తే తాము ఊరుకునేది లేదని తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని బేగరికంచ, మీర్కాన్‌పేట గ్రామ పంచాయతీల పరిధిలో నెలకొల్పనున్న ఫ్యూచర్‌సిటీకి ఔటర్‌ రింగ్‌ రోడ్డు, రావిరాల ఎగ్జిట్‌ 13 నుంచి ఫ్యూచర్‌ సిటీ వరకు 300 ఫీట్ల రోడ్డు వేయడానికి రైతులకు సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తాతల నాటి నుంచి పట్టా భూముల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారని, రోడ్డు కొరకు భూసేకరణ చేసే సమయంలో సమాచారం ఇవ్వకుండా శనివారం మండలంలోని రాచులూరు, బేగంపేట, తుర్కగూడ గ్రామాల్లో అధికారులు సర్వే చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల విషయంలో ప్రజలకు కుప్తంగా వివరించాకే ముందుకెళ్లాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు తదితరులున్నారు.

కుల గణనపై అపోహలొద్దు


సర్వేలో జంగయ్య, యాదయ్యగౌడ్

మాడ్గుల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేపై అపోహలను నమ్మొద్దని మాజీ ఎంపీపీ అన్నేపాక జంగయ్య, మాడ్గుల మాజీ సర్పంచ్‌ కాట్ల యాదయ్యగౌడ్‌ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేలో వారు పాల్గొని ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని కోరారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం

కేశంపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వే చరిత్రాత్మక నిర్ణయమని కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో ఆదివారం ఆమె స్వగృహంలో ఎన్యూమరేటర్‌కు సమగ్ర కుటుంబ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్‌ జోడో యాత్రలో కులగణనపై స్పష్టమైన ప్రకటన చేశారని గుర్తుచేశారు. సామాజిక న్యాయం కోసం సీఎం కులగణనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, సర్వేతో అన్నికులాలకు ప్రతీ రంగంలో ప్రాధాన్యత దక్కుతుందన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- హెచ్చరిక బోర్డులు లేక నిత్యం యాక్సిడెంట్లు
- మృత్యువాత పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు.. ప్రజాప్రతినిధులు


కిషన్‌నగర్‌ శివారులోని సోలార్‌ ప్లాంట్‌ వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

షాద్‌నగర్‌ రూరల్‌, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌ పట్టణం నుంచి చించోడు- అయ్యవారిపల్లి వెళ్లే రోడ్డు వెంట ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఏళ్ల తరబడి రోడ్డు విస్తరణ చేయకపోవడంతో మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద రోడ్డు వెడల్పు చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఫరూఖ్‌నగర్‌ మండలం కిషన్‌నగర్‌ నుంచి అయ్యవారిపల్లి నుంచి బీమారం వరకు రోడ్డు విస్తరణ చేశారు. కానీ, కిషన్‌నగర్‌ నుంచి షాద్‌నగర్‌ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేదు. దాంతో మలుపులు ప్రమాదకరంగా మారాయి. కిషన్‌నగర్‌ శివారులోని సోలార్‌ ప్లాంట్‌ మలుపు ప్రమాదాలకు అడ్డాగా మారింది. అక్కడ ప్రమాదాలు జరిగి చాలామంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. సోలార్‌ ప్లాంట్‌ వద్ద ఉన్న మలుపు వద్ద గతంలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మండల పరిధి చౌలపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్దకు స్కూటర్‌పై వెళ్తుండగా అదే మలుపు వద్ద వేగంగా రోడ్డు కిందికి వెళ్లిన ద్విచక్ర వాహనదారుడు కింద ఉన్న రాళ్లపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అదేవిధంగా ఆగిర్యాలకు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై షాద్‌నగర్‌ వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొనడంతో ఆగిర్యాల గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందారు.

మలుపుల వద్ద రోడ్లను వెడల్పు చేయాలి



షాద్‌నగర్‌ నుంచి కిషన్‌నగర్‌ వరకు రోడ్డు వెడల్పు చేయాలని చాలా ఏళ్ల నుంచి కోరుతున్నాం. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కనీ సం మలుపుల వద్దనైనా రోడ్డును వెడల్పు చేయాలి.

- కట్టా వెంకటేష్‌గౌడ్‌, కిషన్‌నగర్‌

కోసుకుపోయిన రోడ్డుతో నానా ఇబ్బందులు

షాద్‌నగర్‌ పట్టణం నుంచి కిషన్‌నగర్‌ వరకు సింగిల్‌ రోడ్డు ఉండటం.. అది కూడా రెండు వైపులా కోసుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇచ్చేందుకు రోడ్డు దిగితే మళ్లీ ఎక్కడానికి పాట్లు పడాల్సివస్తుంది. ఈక్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు కిరువైపులా చెట్లు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. రోడ్డు కిరువైపులా మట్టి పోస్తే కొంత వరకు ప్రమాదాలు నివారించవచ్చని వాహదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలి


రిలే దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు, తదితరులు

తలకొండపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం ఏర్పాటుకై ఎలాంటి పోరాటాలకైనా వెనకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 16వ రోజుకు చేరాయి. దీక్షలకు మద్దతుగా వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దీక్షలకు పలువురు నేతలు సంఘీభావం ప్రకటించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ 9 గ్రామపంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లి మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్‌ ముకురాల అశోక్‌గౌడ్‌, వైస్‌ చైర్మన్‌ ఏదుల శరత్‌శ్చంద్ర జేఏసీ కార్యదర్శి ఏదుల అశోక్‌, ఆంజనేయులు గౌడ్‌లు తెలిపారు. అధికార పార్టీకి చెందిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ విషయంలో చొరవ తీసుకోవాలనికోరారు. లేనిఎడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. త్వరలో రాబోయే పంచాయతీ ఎలక్షన్లను బాయ్‌కాట్‌ చేస్తామని, ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. రిలే దీక్షలో దాస్యతండా, గట్టిప్పలపల్లికి చెందిన గోపాల్‌నాయక్‌, రాత్లావత్‌వాలియా, నర్సిహగౌడ్‌, బాలయ్య, మాల దాసు, ముకురాల అశోక్‌గౌడ్‌, కటికరాజు, ఏదుల శరత్‌, చంద్ర తదితరులు కూర్చున్నారు.


అవార్డు అందుకుంటున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

టాస్క్‌ సీవోవో సుంకిరెడ్డికి 'టాగ్‌' ఎక్సలెన్స్‌ అవార్డు

ఆమనగల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో ఐక్యత ఫౌండేషన్‌ ద్వారా ఫౌండేషన్‌ చైర్మన్‌ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అందిస్తున్న సేవలకు గుర్తింపు లభించింది. ఈమేరకు అమెరికాలోని తెలంగాణ అసోసియేషన్‌ ఆఫ్‌ గ్రేటర్‌ హ్యూస్టన్‌(టాగ్‌) ఆధ్వర్యంలో హ్యూస్టన్‌ నగరంలో శనివారం టాగ్‌ పదో వార్షికోత్సవం నిర్వహించారు. టాస్క్‌ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పుట్టి నగడ్డ కల్వకుర్తికి సుంకిరెడ్డి అందిస్తున్న సేవలను టాగ్‌ అసోసియేషన్‌ అభినందించి ప్రతిష్టాత్మకమైన ఎక్సలెన్స్‌ అవార్డు ప్రదానం చేశారు. తెలంగాణ భాష, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు అమెరికాలో టాగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు, తెలంగాణ గొప్పతనం, చరిత్ర, భవిష్యత్తు తరాలను ఏకంచేసి సమాజసేవలో పాలుపంచుకుంటుండటం ప్ర శంసనీయమని పేర్కొన్నట్లు సుంకిరెడ్డి చెప్పారు.

నకిలీ నారుకు కళ్లెం..!

(5వ పేజీ తరువాయి)

లైసెన్సు లేకుండా నర్సరీలు నిర్వహిస్తున్నారు. వీటిని గుర్తించి నిర్వాహకులకు ఉద్యానశాఖ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసులు అందుకుని రిజిస్ట్రేషన్‌ చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ముందుకు సాగుతున్నారు.

ఇవీ నిబంధనలు

నర్సరీ ప్రధాన ద్వారా వద్ద అక్కడ లభించే నారు, మొక్కల సంఖ్య, ధరల పట్టి తెలుగులో రాసి పెట్టాలి. విత్తనం ఎక్కడి నుంచి సేకరించారు. బిల్లు వివరాలు, లాట్‌, బ్యాచ్‌ నెంబరు, విత్తన పరీక్ష వివరాల పత్రాలు, విత్తనం తయారు చేసిన తేది, గడువు తేది, నారు, మొక్కలు అమ్మిన తేది తదితర వివరాలు విధిగా నమోదు చేయాలి. నాణ్యమైన నారు, మొక్కల తయారీకి సరైన పొలం ఎన్నుకోవడంతో పాటు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి. పిల్ల, తల్లి మొక్కల బ్లాక్‌లను వేరుగా ఉంచాలి. వీటితోపాటు కార్యాలయం, స్టోర్‌ వసతులు ఉండాలి. షేడ్‌ నెట్‌ హౌస్‌ సమకూర్చుకోవాలి. నారు వయస్సు, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యేక నిబంధనలు పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే నిర్వాహకులపై చట్ట ప్రకారం రూ.5వేల జరిమానా, ఏడాది జైలుశిక్ష, లేదంటే రెండూ విధించవచ్చు. రైతులు రిజిస్ట్రేషన్‌ ఉన్న నర్సరీల నుంచే నారు కొనుగోలు చేయాలి. బిల్లు తీసుకుని జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి.

లైసెన్స్‌కు కావాల్సిన పత్రాలు

- దరఖాస్తుదారుడి చిరునామా కోసం టెలిఫోన్‌, కరెంట్‌ బిల్లు, ఓటరు, ఆధార్‌ కార్డు ఏదైనా ఉండాలి.
- నర్సరీ చిరునామా ఫొటోతో సహా ఉండాలి.
- భూమి పట్టదారు పాసుపుస్తకం జిరాక్స్‌, లీజు డాక్యుమెంట్‌ పత్రాలు.
- నర్సరీ లేఅవుట్‌, మ్యాప్‌-ప్రభుత్వ ఆమోదిత సర్వేయర్‌ లేదా ఏజెన్సీతో పొంది ఉండాలి.
- నర్సరీలో మౌలిక సదుపాయాల పూర్తి వివరాలు ఉండాలి.
- మూడేళ్ల ఉత్పత్తి వివరాలు తెలపాలి.
- నర్సరీ డిజిటల్‌ ఫొటో కాపీ పొందుపర్చాలి.
- చలానా నకలు రసీదు జత చేయాలి.

రిజిస్ట్రేషన్‌ ఫీజు చెల్లింపు వివరాలు..

- నర్సరీల రిజిస్ట్రేషన్‌కు సంబంధిత జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారిని సంప్రదించాలి.
- పండ్ల మొక్కల ఉత్పత్తికి రిజిస్ట్రేషన్‌ ఫీజు రూ.5వేలు.
- కూరగాయలు, పూలు, ఔషధ, సుగంధద్రవ్యాల నర్సరీ రిజిస్ట్రేషన్‌ ఫీజు 2-4 లక్షల ఉత్పత్తి వరకు రూ.వెయ్యి, 4 లక్షలకు మించి ఉత్పత్తికి రూ.2,500 చెల్లించాలి.
- రిజిస్ట్రేషన్‌ తర్వాత పండ్ల మొక్కలకు మూడేళ్లకు ఓసారి రూ.1,500 కట్టి లైసెన్స్‌ రెన్యువల్‌ చేయించుకోవాలి.
- కూరగాయలు, పూలు, ఔషధ, సుగంధ ద్రవ్యాల మొక్కలకు ఏటా 4లక్షల కన్నా తక్కువైతే రూ.500, 4 లక్షల కన్నా ఎక్కువైతే రూ.వెయ్యి కట్టి లైసెన్స్‌ రెన్యువల్‌ చేసుకోవాలి.

నోటీసులు జారీ చేస్తున్నాం



అనుమతి లేకుండా కొనసాగుతున్న నర్సరీలకు నోటీసులు జారీ చేస్తున్నాం. 30 రోజుల్లోగా రిజిస్ట్రేషన్‌ చేసుకోకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు. ప్రతీ నర్సరీ యజమాని రిజిస్ట్రేషన్‌ చేయించుకుని లైసెన్స్‌ పొందాల్సిందే. నాణ్యమైన నారును మాత్రమే రైతులకు విక్రయించాలి. విక్రయ సమయంలో తప్పక రసీదు ఇవ్వాలి. యజమానులు రికార్డుల్లో వివరాలు పొందుపర్చాలి.

- సురేష్‌, జిల్లా ఉద్యానశాఖ అధికారి

సజావుగా గ్రూప్‌-3 పరీక్ష

(5వ పేజీ తరువాయి)

హాజరు కాలేదు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో 14 సెంటర్లలో 17,160 మంది అభ్యర్థులకు గాను 9,789 మంది హాజరయ్యారు. 7371 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు మొదటి పేపర్‌, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్‌ పరీక్ష నిర్వహించారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. 9.30 గంటల తర్వాత గేట్లు మూసి వేశారు.


మొయినాబాద్‌ రూరల్‌ : ఎన్టీఆర్‌ విద్యాసంస్థ వద్ద హాల్‌టికెట్‌ నంబర్లను సరిచూసుకుంటున్న అభ్యర్థులు

ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు

శేరిగూడలోని శ్రీదత్త ఇంజినీరింగ్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్‌-3 పరీక్షా కేంద్రానికి నలుగురు అభ్యర్థులు ఆలస్యంగా వచ్చారు. వీరు 9.30 గంటల తర్వాత సెంటర్‌ వద్దకు చేరుకున్నారు. దీంతో అధికారులు వీరిని లోనికి అనుమతించలేదు. అభ్యర్థులు వారిని బతిమిలాడినా ఎంట్రీ చేయలేదు. దీంతో ఆ అభ్యర్థులు నిరాశగా వెనుదిరిగారు. అలాగే మొయినాబాద్‌లోని భాస్కర ఇంజినీరింగ్‌ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి కూడా ఇద్దరు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించలేదు.

కేంద్రాలను సందర్శించిన కలెక్టర్‌

జిల్లాలో మొదటి రోజు జరిగిన గ్రూప్‌-3 పరీక్షా కేంద్రాలను కలెక్టర్‌ సి. నారాయణరెడ్డి సందర్శించారు. పరీక్ష జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. తట్టి అన్నారంలోని శ్రేయస్‌ ఇంజినీరింగ్‌ కాలేజీ, హయత్‌నగర్‌లోని వర్ద్‌ అండ్‌ డీడ్‌ ఎడ్యుకేషన్‌ అకాడమీలో ఏర్పాటు చేసిన కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లోని సౌకర్యాలను పరిశీలించారు. కలెక్టర్‌ వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దారు, తదితరులున్నారు.

జయకృష్ణకు 'నేషనల్‌ బెస్ట్‌ యువ పురస్కార్‌'


మధుసూదనాచారి నుంచి పురస్కారం అందుకుంటున్న జయకృష్ణ

యాచారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందివనపర్తికి చెందిన జయకృష్ణ నేషనల్‌ బెస్ట్‌ యువ పురస్కార్‌ అవార్డు అందుకున్నారు. ఈమేరకు శనివారం సాయంత్రం రవీంద్రభారతిలో చిల్డ్రన్స్‌ డేను పురస్కరించుకొని మాజీ స్పీకర్‌ మధుసూదనాచారి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ డాక్టర్‌ రియాజ్‌, వరంగల్‌ ఎంపీ కడియం కావ్యల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. అనాథలకు సేవలందించడంతో ఆయన సేవలను గుర్తించిన గ్లోబల్‌ ఫౌండేషన్‌ సంస్థ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ దినేష్‌ అవార్డుకు ఎంపిక చేశారు. పురస్కారంతో బాధ్యత మరింత పెరిగిందని జయకృష్ణ చెప్పారు.

పన్నులు పెంచకుండానే ప్రగతికి బాటలు

- ప్రజాపాలన విజయోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌
- ఆకట్టుకున్న ఆరు గ్యారెంటీలపై కళాప్రదర్శనలు

షాద్‌నగర్‌ అర్బన్‌, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అప్పుల కుప్పగా ఉన్నా.. ప్రజలపై పన్నుల భారం మోపకుండానే ఇచ్చిన హామీలను అమలు పరుస్తూ, అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని షాద్‌నగర్‌ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌ వీర్లపల్లి శంకర్‌ పేర్కొన్నారు. షాద్‌నగర్‌ పట్టణంలో ఆదివారం రాత్రి తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంగీత-నాటక ప్రదర్శన రాష్ట్ర చైర్‌పర్సన్‌ అలేఖ్య పులిజాల ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలపై కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గత ఎన్నికల ముందు కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై కళాకారులు నృత్య ప్రదర్శనలు చేస్తూ, ఒక్కొక్కటిగా ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్‌ మాట్లాడుతూ గత పాలకులు పదేళ్లలో అందినకాడికి దండుకుని రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌ నియోజకవర్గానికి సాగునీటి సౌకర్యంతో పాటు రైల్వే లైను, పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేసి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి చేస్తున్న కృషిని కేటీఆర్‌ లాంటి బీఆర్‌ఎస్‌ నాయకులు కుట్రలు చేస్తూ, అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్‌ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అండగా నిలుస్తారన్నారు. అలేఖ్య పులిజాల మాట్లాడుతూ షాద్‌నగర్‌లో ప్రారంభమైన కాంగ్రెస్‌ ప్రజాపాలన విజయోత్సవ సంస్కృత కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్‌ ఆర్డీవో సరిత, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌


ప్రజాపాలన విజయాలపై ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

క్రైం కార్నర్‌

బావ, మరిది ఘర్షణ.. ఇద్దరూ మృతి

మాడ్గుల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో బావ, మరిది ఘర్షణపడ్డారు. ఒకరిపై మరొకరు దాడికి పాల్పడటంతో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయిన ఘటన మండల పరిధిలోని నాగిళ్ల గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిళ్లకు చెందిన బర్కని యాదయ్యకు మేడిపల్లికి చెందిన మక్కపల్లి శ్రీను సోదరిని ఇచ్చి వివాహం చేశారు. పదేళ్ల క్రితం కుటుంబ కలహాలతో యాదయ్య భార్యను చంపేశాడు. దాంతో అతడు జైలుశిక్ష అనుభవించి ఇటీవలే విడుదలయ్యాడు. ఈక్రమంలో శ్రీను ఆదివారం అతడి భార్య ఊరుకూడా నాగిళ్ల కావడంతో అక్కడికి వెళ్లాడు. అయితే, తన అక్క మరణానికి కారణమైన బావపై కోపం పెంచుకొన్న అతడు.. ఆదివారం రాత్రి నాగిళ్లలోని యాదయ్య ఇంటికి వెళ్లాడు. మా అక్కను చంపావంటూ బావ యాదయ్యపై చేయి చేసుకున్నాడు. దాంతో యాదయ్య ఇంట్లో ఉన్న గొడ్డలి తీసుకొచ్చి శ్రీనును నరికి చంపాడు. అయితే, అప్పటికే జైలు జీవితం గడిపిన యాదయ్య అనారోగ్యంతో ఉన్నాడని.. ఘర్షణలో అతడికి కూడా గాయాలు కావడంతో చనిపోయాడని గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు పోలీసులకు సమాచారం అందడంతో విచారణ ప్రారంభించారు.

ఆరు క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టివేత

యాచారం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నందివనపర్తిలో ఆదివారం సాయంత్రం పెట్రోమొబైల్‌ పోలీసులు ఆరు క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టుకున్నారు. కడ్తాల్‌ మండలంలోని పల్లెచెల్కతండాకు చెందిన వి.భద్యనాయక్‌, పెద్దయ్యలు రేషన్‌ బియ్యం ఆటోలో తరలిస్తున్నట్లు పెట్రోమొబైల్‌ పోలీసులకు సమాచారమందింది. దాంతో నందివనపర్తిలో పోలీసులు దాడిచేసి ఆరు క్వింటాళ్ల రేషన్‌ బియ్యంతో పాటు ఆటోను, ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

షాబాద్‌, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బోడంపహాడ్‌లో చోటుచేసుకుంది. బాధితురాలు కారు సువర్ణ కథనం మేరకు గ్రామ సమీపంలో శనివారం సువర్ణ ఆవును మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్‌ ఎర్త్‌ వైర్‌ తగలడంతో కరెంట్‌ షాక్‌ తగిలి ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని బాధితురాలు తెలిపింది.

వైన్‌షాప్‌లో చోరీ

ఆమనగల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని కల్వకుర్తి రోడ్డులో గల శ్రీనివాస్‌ వైన్‌షాప్‌లో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై వెంకటేష్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి నిర్వాహకులు రోజువారీగా వైన్‌షాప్‌ మూసివేసి ఇంటికి వెళ్లారు. అనంతరం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు షాపు పైభాగంలో గల రేకులను తొలగించి లోపలికి ప్రవేశించారు. కౌంటర్‌లో ఉన్న రూ.50వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం పోలీసులు విచారణ చేపట్టారు.

మద్దతు ధర కల్పనకే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్‌

ఆమనగల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతు ధర కల్పనకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని డీసీసీబీ డైరెక్టర్‌ గంప వెంకటేష్‌ అన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఆ యన కోరారు. ఆమనగల్లు సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని కోరారు. కడ్తాల సింగిల్‌విండో సబ్‌సెంటర్‌ ఆవరణలో ఆమనగల్లు సొసైటీ ఆధ్వర్యంలో నేడు(సోమవారం) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, డీసీసీబీ చైర్మన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి, ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రాలలో విక్రయించి వరి క్వింటాల్‌కు రూ.2,330 మద్దతు ధర పొందాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహకంగా రూ.500 ఇవ్వనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులను మోసగిస్తే ఎంతటి వారైనా సరే చర్యలు తప్పవన్నారు. వైస్‌చైర్మన్‌ సత్యం, డైరెక్టర్‌ జోగు వీరయ్య, సీఈవో దేవేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐక్యత ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 27వరకు ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్‌ ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ సుంకిరెడ్డి వరప్రసాద్‌ రెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గం ప్రజలంతా కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈమేరకు ఆదివారం ఆమనగల్లు పట్టణంలో ఫౌండేషన్‌ సభ్యులతో కలిసి శిబిరం ఏర్పాట్లను వరప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. శిబిరానికి సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ అంధత్వ నివారణ కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకుపోవాలని ఐ కృత ఫౌండేషన్‌ చైర్మన్‌, టాస్క్‌ సీవోవో ఆధ్వర్యంలో మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. ప్రముఖ చెన్నై శంకర నేత్రాలయం సహకారంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వరప్రసాద్‌ రెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గం ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంప్‌కు హాజరయ్యే వారందరూ ఆధార్‌ కార్డు జిరాక్స్‌ తీసుకురావాలని తెలిపారు. ఫౌండేషన్‌ సభ్యులు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్‌, మల్లేష్‌నాయక్‌, శ్రీను, కొండల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, మల్లయ్య, కొండల్‌యాదవ్‌, రఘు, గణేష్‌, శేఖర్‌, శ్రీపతి, రాజు. విజయ్‌, నాగిల్ల శివ, కళ్యాణ్‌, శివ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి

మను, మయ గ్రామ కమిటీ

మాడ్గుల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మను, మయ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈమేరకు ఆ సంఘం సలహాదారుడు ఇర్వింటి భూపేష్‌ సమక్షంలో ఇర్విన్‌లో ఆదివారం మను, మయ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కాసోజీ విశ్వరూపచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాసోజి జంగాచారి, రాఘవాచారి, నర్సింహచారి, కనకాచారి, జనార్ధనాచారి, యుగేందరాచారి, తదితరులున్నారు.


మను, మయ కమిటీ